# మందు బాబులకు ఝలక్ .!

- మద్యం సేవించి వాహనాలు పడిపిన ఇద్దరికి జైలుశిక్ష

**తాండూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందు బాబులకు వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హర్ష చౌదరి మందు బాబుల కు షాక్ ఇచ్చారు. ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష, జరిమానాలతో పాటు మరో 78మందికి జరిమానాలు విధించారు. ఈ విషయాన్ని గురువారం తాండూరు పట్టణ సిఐ సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ ఆండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన గొర్ల స్టాలిన్‌కు 3రోజుల జైలుశిక్షతో పాటు రూ.3వేల జరిమాన, తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామానికి చెందిన నడిమింటి శ్రీనివాస్‌కు 2రోజుల జైలుశిక్ష, రూ 3వేల జరిమాన విధించారిని సిఐ తెలిపారు. అదేవిదంగా మరో 78మందికి రూ.1లక్ష14వేల జరిమాన విధించారని వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరిత్య చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# పుస్తక పఠనం అందని ద్రాక్షేనా..?

-ఎమ్మెల్యే సారు.. గ్రంథాలయం ఏర్పాటు చేయండి

**నందిగామ ఆగస్టు 21 ప్రభాతవార్త :** అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న విధంగా తయారైంది నందిగామ మండల కేంద్రం పరిస్థితి. ప్రభుత్వాలు మారిన.. పాలకులు మారిన నందిగామలో గ్రంథాలయం లేక విద్యార్థుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్ర మైన నందిగామలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి గత ఏప్రిల్ 21న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డికి మండల నాయకులు వినతి పత్రం అందజేశారు. నేటికీ ఐదు నెలలు కావస్తున్నఅతిగతి లేదు. ఉద్యోగాల కోసం, గ్రూపులకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు గ్రంథాలయం లేక అటు కొత్తూరు, ఇటు షాద్నగర్ కు వెళ్తున్నారు. స్థానికంగా ఉన్న విద్యార్థులకు పుస్తక పఠనం ద్వార విజ్ఞానాన్ని సమపార్జించే అవకాశం లేకుండా పోయింది. విద్యావంతులైన యువతీ యువకులకు గ్రంథాలయం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి నందిగామలో గ్రంథాలయ భవనం నిర్మాణం చేపట్టాలని విద్యావంతులైన యువతీ యువకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ చంద్రరెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఆగష్టు21, ప్రభాతవార్త:-**
భూ భారతి దరఖాస్తులను, ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం భూభారతి దరఖాస్తుల పై, ఇతర అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఇతర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత ఆర్డీవోలకు, తహసిల్దార్లకు సూచించారు. ప్రజలు దళారులను నమ్మవద్దని, వారిని నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పెండింగ్ పెట్టకుండా అన్ని మాడ్యుల్స్ ప్రకారం పరిశీలన చేసి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని దరఖాస్తులకు సంబంధించి వెంటనే సంబంధిత దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని ఆయన అన్నారు. పదేపదే అవే దరఖాస్తులు పునరావృతం అవుతున్నాయి. అలా కాకుండా వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని పక్కదారికి మళ్ళించకుండా నేరుగా మిల్లులు చేరేందుకు పర్యవేక్షణ చేయాలని సివిల్ సప్లయ్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని ఆక్రమణలకు గురికాకుండా చూడాలని, ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులు పై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సంగీత, ఆర్డీవోలు తహసిల్దార్లు సివిల్ సప్లయ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిజి బ్యాంకులో ఇంటి దొంగలు

- ఫోర్జరీ చేసి ఫిక్స్‌డ్ డిపాజిట్ల డబ్బులు డ్రా
- 1994లోని బాండ్లపైనే ఫోకస్
- లబోదిబోమంటున్న లబ్దిదారులు




**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** డబ్బు అంటే ఎవరికి చేదు!. అప్పనంగా వస్తున్నాయంటే అడ్డమైన గడ్డి కరిచేందుకు సిద్ధమైనారు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఇంటి దొంగలు!. తాండూరు శాఖలో చోటు చేసుకున్న సంఘటనపై విశ్వసనీయ వర్గాల కథనం ఇలా ఉంది.. ఇరవై ఐదేండ్ల క్రితం గోల్కొండ గ్రామీణ బ్యాంకుగా ఉన్న సమయంలో పలువురు రైతులు తమ డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. అప్పట్లో బ్యాంకుల్లో 10 శాతం ఉన్న వార్షిక వడ్డీ రేట్లకు ఆకర్శితులైనారు. అయితే, ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లను అప్పట్లో కంప్యూటరీకరణ చేయలేదు. చేతిరాత ద్వారా బాండ్లను అందజేశారు. డిపాజిట్ కాలపరిమితి ప్రకారం వడ్డీ ఎంత వస్తుందో అందులో పొందుపరిచేవారు. కాలక్రమేణా బ్యాంకు పేరు దెక్కన్ గ్రామీణగా మారగా కొంతకాలం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారింది. పాత బాండ్లపై కన్నేసిన కొంతమంది ఇంటిదొంగలు వాటిని కాజేయాలని పథకం రూపొందించారు. తాత్కాలిక వేతనంపై పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి బాండ్ల పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. 1994 సంవత్సరంలో ఫిక్స్‌డ్ చేసిన బాండ్లను ఎంచుకున్నారు. గతంలో ఫిక్స్‌డ్ చేసిన కొంత మంది రైతుల పేరిట కొత్తగా బాండ్లకు సీరియల్ నెంబర్ ఆధారంగా బినామీ రైతులను సృష్టించారు. రైతుల పేరిట అవసరమైన ధృవీకరణ పత్రాలను సేకరించి దర్జాగా డబ్బు డ్రా చేశారని తెలుస్తున్నది. ప్రాథమిక సమాచారం మేరకు ఐదారు రైతుల డబ్బులు స్వాహా అయినట్లు తెలిసింది. అసలైన రైతులు ఒరిజినల్ బాండ్లను తీసుకుని బ్యాంకుకు రాగా స్కామ్ వెలుగుచూసింది. అనుమానితులపై బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మరో ఉద్యోగి కోసం గాలిస్తున్నారని తెలిసింది.

ఈ సంఘటనపై తాండూరు పట్టణ సర్కిల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా తెలంగాణ బ్యాంకులో కుంభకోణం జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతు న్నామని చెప్పారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉందో విచారణలో తేలు తుందని సీఐ వివరించారు.

# నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం!

-పెద్ద షాపూర్ వద్ద నీట మునిగిన పంట పొలాలు -లక్షల్లో నష్టపోయిన రైతులు





**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 21. ప్రభాతవార్త :** హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పక్కన పెద్ద షాపూర్ గ్రామంలో నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం వలన లక్షలాది రూపాయల విలువచేసే పంటలు నీట మునిగిందని రైతులు తాసిల్దార్ రవీందర్ దత్‌కు ఫిర్యాదు చేశారు. నేషనల్ హైవే పై రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన అధికారులు వర్షపు నీరు పోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని రైతులు బంకట్ లాల్ బాటి. బలరాం బాటి శంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దాతలు కలిసి ఫిర్యాదు చేశారు. వరద నీరు పారడానికి గతంలో సహజసిద్ధంగా ఉన్న కాలువలను ధ్వంసం చేసిన అధికారులు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయలేదని దీనితో ఇటీవల కురిసిన భారీ వర్షంతో జాతీయ రహదారి పక్కన ఉన్న తమ పొలంలోకి పెద్ద ఎత్తున వరద వచ్చి 5 ఎకరాల పొలం నీట మునిగిందని తెలిపారు. ఆ పొలంలో ఎంతో విలువైన సుగంధ తైలం ( హెర్బల్ ప్లాంట్ ) సాగు చేస్తున్నామని వివరించారు. నాలుగు సంవత్సరాల పాటు రావాల్సిన ఈ పంట పూర్తిగా పాడైపోయి లక్షల్లో నష్టం చేకూరిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి తమకు నష్టపరిహారం చెల్లించాలని వరద నీరు తిరిగి రైతుల పొలాల్లోకి రాకుండా వరద కాలువల నిర్మాణానికి సంబంధిత అధికారులను ఆదేశించాలని తాసిల్దారును కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. రైతులకు నష్టం చేకూరే సంఘటనలు పునరావృతం కాకుండా నేషనల్ హైవే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్. పెద్ద షాపూర్ మాజీ ఉపసర్పంచ్ జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. తాసిల్దార్ రవీందర్ దట్ ను కలిసి రైతుల ఇబ్బందులను తెలియజేశారు. హెర్బల్ ప్లాంట్ మొక్కలు నీటిలో మునిగిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం చేకూరిందని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

**హైవే అధికారులతో మాట్లాడతా : రవీందర్ దత్**

పెద్ద షాపూర్ లో రైతులకు జరిగిన నష్టం పై తమకు ఫిర్యాదు అందిందని దానిని పరిశీలించి విచారణ జరపాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశిస్తానని శంషాబాద్ తాసిల్దార్ రవీందర్ దత్ వివరించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి వరద నీరు ముందుకు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచిస్తానని అన్నారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# డబుల్ బెడ్‌రూం కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం

**కీసర, ఆగస్టు21, ప్రభాతవార్త:**
దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్ గూడ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలలోని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్ గూడ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలలోని సమస్యలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 41 బ్లాకులలో ఉన్న సమస్యలలో కొన్నింటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని తప్పకుండా సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎలక్ట్రిసిటి ఫ్లక్యూవేషన్ మార్చడం ట్రాన్స్ ఫార్మర్లకు వంటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ కొరకు సెల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తామని సూచించారు. వర్షం నీరు పోవడానికి పైప్‌లైన్ల మరమ్మత్తులు, ఇళ్లలో గోడలు బీటలు వారి నీరు కారడం వంటి సమస్యలను పరిష్కరిస్తామని అదే విదంగా లిఫ్ట్ మరమ్మత్తులు చేయించడమే కాకుండా సెల్లార్‌లోని నీటి వల్ల ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆట వస్తువులు సమకూర్చడమే కాకుండా పార్కు ప్రక్కనే ఉన్న సంపుకు ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు. 9వ అంతస్తు పైన నీరు కారకుండా పైన మొత్తం చిప్పింగ్ వర్క్ చేయిస్తామని అన్నారు. స్కూల్, బస్తీ దవఖాన, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తామని అన్నారు. స్ట్రీట్ లైట్లు, బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ వారు ప్రతి రోజు వచ్చి చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతు కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పాములు, తేళ్లు రావని సూచించారు. ప్రలి ఇంటిలోకి నీరు వస్తుందని డ్రైనేజీ వాటర్ పైకి వస్తున్నాయని స్థానికులు తెలుపగా కలెక్టర్ స్పందిస్తూ ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. ధార్మికత ఆధ్యాత్మిక పెంపొందించేలా మీరు కోరిన చోట మందిరం, మసీదు, చర్చి నిర్మించి ఇస్తామని సూచించారు. అంతే కాకుండా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని ఎన్నికలు నిర్వహించి మీలో కొంత మందిని ఎన్నుకుని వారి ద్వారా ప్రస్తుత సమస్యలు కాకుండా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇవే కాకుండా స్థానికులు కోరిన స్మశాన వాటిక, సెల్ టవర్, ఉపాధి వంటి సమస్యలను కూడా పరిష్కరిస్తామని వివరించారు. కలెక్టర్ అన్ని బ్లాకులు కలియ తిరిగి సమస్యలను పరిశీలించి స్పదించినందుకు స్థానికులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా హౌజింగ్ అధికారి రమణ, కీసర తహశీల్దార్ అశోక్‌కుమార్, దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూం ఇండ్లలోని సమస్యలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

# భావి పౌరులపై ఆర్టీసీ చిన్న చూపు...

- -విద్యార్థుల సమయానుకూలంగా నడపని బస్సులు
- -ఫుట్‌బోర్డు ప్రయాణంతో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- -క్షేత్రస్థాయిలో పర్యటించని డీఎం



ఉదయం 9 గంటలు గడిచిన బస్సులు లేకపోవడంతో వేచి ఉన్న విద్యార్థులు, ఇతర ప్రయాణికులు



ఆలస్యంగా బస్సు రావడంతో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

**వికారాబాద్, ఆగష్టు 21, ప్రభాతవార్త :**
భావి పౌరులపై ఆర్టీసీ అధికారులు, పాలకులు చిన్న చూపు చూస్తున్నారు. మహిళలకు ఓటు హక్కు ఉందని ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి మహిళల ప్రశంసలు అందుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. పాఠశాల, కళాశాలకు వెళ్లే బాలుర విద్యార్థుల కష్టాలను పాలకులు..ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. సభలు..సమావేశాల్లో మైకు దొరికిందంటే చాలు..నేటి బాలలే..రేపటి పౌరులు అంటూ.. తెగ స్పీచ్‌లు ఇచ్చేస్తుంటారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు రాలేదని ఉద్దేశంతోనే వారి సమస్యను పాలకులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పాఠశాలకు వేళ్ళే విద్యార్థుల ప్రయాణ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని విద్యార్థుల తల్లి దండ్రులు మండిపడుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఏ బస్సులో ప్రయాణిద్దామనుకున్నా..సామార్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుడంతో బస్సు ప్రయాణం నరక యాతనను తలపిస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు ప్రతినిత్యం ఆర్టీసీ బస్సుల కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా మన్నెగూడ, చేవెళ్ళ, హైద్రాబాద్ వైపు వివిధ పాఠశాల, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు ప్రతి నిత్యం బస్సుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళల్లో పాఠశాల, కళాశాలల సమయానుకూలంగా బస్సులు నడుపకపోవడంతో విద్యార్థులు పాఠశాల సమయానికి గమ్యాన్ని చేరుకోలేక పోతున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులతో ప్రతినిత్యం చివాట్లు పడాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. చేవెళ్ల-హైదరాబాద్ వైపు ఉదయం 7.50 గంటల నుంచి 8.50 గంటల మద్య సమయంలో ఒక్క బస్సు కూడా లేకపోవడంతో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. 8.50 గంటలకు బస్సు ప్రాంగణానికి వికారాబాద్ డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు వచ్చినప్పటికీ టీ..కాఫీ..టిఫిన్ లు చేసేందుకు డ్రైవర్, కండక్టర్‌లు వెళ్ళి 9 గంటల తర్వాత బస్సులను నడుపుతున్నారు. ఈ తంతు అంతా స్థానిక కంట్రోలర్ అధికారి చూస్తూ ఉన్న ఏమి చేయలేని పరిస్థితి. ఎందుకంటే..ఆయన పదవీ విమరణ పొంది..అవుట్ సోర్సింగ్ ద్వారా తిరిగి మళ్ళి ఉద్యోగంలో చేరాడు. దీంతో ఆయన మాటను కండక్టర్‌లు కానీ..డ్రైవర్లు కానీ ఎవరూ లెక్క చేయరు. దీంతో కంట్రోలర్ కుర్చీకే పరిమితమవుతాడు. ఈ విషయమై పలుమార్లు స్థానిక డిపో మేనేజర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత డిపో మేనేజర్ స్పంధించి, విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో త్వరలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి డిపో ముందు ధర్నా కార్యక్రమాలు చేపడుతామని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

# నేటి నుంచి పనుల జాతర ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
గ్రామీణాభివృద్ధి శాఖ - మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి - 2025 తెలంగాణ పనుల జాతరలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఉపాది హామీ, గ్రామీణాభివృద్ధి అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాదులను మెరుగుపరచడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల కనీస కూలీ పని కల్పించడానిక 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు సిద్దం చేయడం జరిగిందన్నారు. 2025లో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత అంకితభావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి గ్రామీణ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లుగా తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, స్వచ్ఛ భారత్ కమిషన్(గ్రామీణ్) ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో పనుల జాతర -2025కు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పనులు ఇలా..

ఈ ఆర్థిక సంత్సవరంలో చేపట్టబోయే నూతన గ్రామీణ పంచాయతీ భవనాల నిర్మాణాలకు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్) ద్వారా నిర్మించే ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, సగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటర్ కాంప్లెక్స్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం(సీఆర్ఆర్) నిధులతో కొత్తంగా చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేయబడుతాయన్నారు. 1212 పనులకు రూ.15కోట్ల30లక్షల94వేల వ్యయంతో పనులు మొదలు పెడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పూర్తి అయినా గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడి భవనాలను, గ్రామీణ రహదారులు ,సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా క్రింద చేపట్టే పలు జీవనోపాధి అభివృద్ధి పనులు, ముఖ్యంగా స్వయంగా సహాయక మహిళలకు పశువుల కొట్టాల నిర్మాణం, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్ల నిర్మాణం, పండ్లతోటల పెంపకం, వానపాముల ఎరువుల తయారీ నిర్మాణం, ఆజోలా పిట్ట నిర్మాణం లాంటి పనుల మంజూరీ ఉత్తర్వులను సమావేశంలో లబ్దిదారులకు అందజేస్తామన్నారు.

# అంబపురం చెరువు అలుగు

-గంగమ్మకు పూజలు చేసిన గ్రామస్తులు



అంబపురం చెరువు అలుగు పారడంతో పూజలు చేస్తున్న గ్రామస్తులు.

**నందిగామ ఆగస్టు 21 ప్రభాతవార్త**
గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నందిగామ అంబపురం చెరువు అలుగు పారింది. చెరువు నిండడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని, బోరు బావుల్లోకి పుష్కలంగా నీళ్లు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తు గ్రామస్తులు, రైతులు గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ పూజలో షాద్నగర్ ఏఎంసి డైరెక్టర్ నర్సింలు, మాజీ సర్పంచ్ లు కొమ్ముకృష్ణ, వంకాయల ర్నారెడ్డి (రామన్న), మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు జిల్లెల్ల ర్నా రెడ్డి, జిల్లెల్ల బాల్ రెడ్డి, చించేటి కృష్ణ గౌడ్, కృష్ణారెడ్డి, పెంటారెడ్డి, టైలర్ కృష్ణ, పిట్టల రాములు, బి లింగం గౌడ్, తడకల జంగయ్య , ఉమ్మెత్తల అంతఏంటయ్యా, ఎర్రగుంట బాల్ రాజ్, పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని గ్రామ సరిహద్దులు సర్వే చేపడతాం

-సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఎడి రాంరెడ్డి

**వికారాబాద్, ఆగష్టు 21, ప్రభాతవార్త :**
పరిపాలనా సరిహద్దుల డేటా బేస్ లో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా వారు వికారాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎం పిక చేసి, వికారాబాద్ జిల్లాలో అన్ని గ్రామ సరిహద్దుల ు సర్వే చేయుట నిర్ణయించినట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రాంరెడ్డి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. ఇందులో భా గంగా జిల్లాలో మొ దటిగా వికారాబాద్ మండలంలోని గ్రామాల సరిహద్దుల సర్వే ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి



పాఠశాలలో మొక్కను నాటుతున్న డిఎస్‌పి

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి అన్నారు. జిల్లా ఎస్‌పి నారాయన్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దేముల్ మండలం గొట్లపల్లి మాడల్‌స్కూల్‌లో షీటీం అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి హజరై మాట్లాడుతూ సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల యువత, విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న సాంకేతికను ఆసరాగా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకొని ఇటు వంటి మోసాలకు గురి కావద్దని అన్నారు. బాల్య వివాహలను అరికట్టే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొనికరెంటు స్థంబాలు, ట్రాన్స్‌పార్మర్ల దగ్గరకు వెళ్ళోదని అన్నారు. కాలువలు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రవాహం తగ్గిన తరువాతనే వెళ్ళాలనిఅన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, రొడ్డు భద్రతలు పాటించాలని అన్నారు. ఆపద సమయంలో 100 డయల్‌కు కాల్ చేయాలని అన్నారు. ప్రతిఒక్కరు రెండు మొక్కలు నాటి ప్రకృతి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుకుమార్, ఎఎస్‌ఐ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ గాయత్రి, షీటీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద బోనాల పండుగ

**-పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్, డిఆర్‌ఓ ఎఒ,నాయకులు,ఉద్యోగులు**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అమ్మవారిని బోనాల పండుగ సందర్భంగా దర్శించుకున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, ఎఒ రాంమోహన్, అధ్యక్షులు రవిప్రకాశ్ తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఉద్యోగులు జరుపుకున్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పోతరాజుల ఊరేగింపులు, డప్పుదరువులతో,కళాకారుల విన్యాసాలతో ఉద్యోగులంతా పాల్గొని ఘనంగా బోనాల పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఎఒ రాంమోహన్, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్‌లు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా టిఎన్‌జిఓస్ రాష్ట్ర అధ్యక్షులు టిజాక్ ఛైర్మన్ మారాం జగదీశ్వర్ బోనం స్వయంగా ఎత్తి అమ్మవారికి సమర్పించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటే బోనాల పండుగను ఉద్యోగ సంఘాలు సాంప్రదాయబద్ధంగ జరుపుకోవటం ఉద్యోగుల ఐక్యతకు ప్రతీక అని గుర్తు చేశారు.కార్యక్రమంలో టిఎన్‌జిఓస్ రాష్ట్ర, జిల్లా, యూనిట్‌ల,పలు మండలాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధి హామీ పనుల జాతర

**మంచాల, ఆగస్టు 22,ప్రభాతవార్త :**

ఉపాధి హామీ 2025 పనుల జాతర నేటి నుండి ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలములోని అన్ని గ్రామపంచాయతీలలో నేటి నుండి ఉపాధి హామి, స్వచ్ఛ భారత్, వాటర్ షెడ్, పిఆర్ ఇంజనీరింగ్, ఆర్ డబ్ల్యు ఎస్ శాఖల క్రింద పూర్తి అయిన పనులకు ప్రారంభోత్సవము, నూతన పనులకు భూమి పూజ చేయనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నందు గ్రామసభ ఏర్పాటుచేసి పథకము యొక్క లక్ష్యాలను, ముఖ్య ఉద్దేశాలను గ్రామసభ నందు తెలిపి రైతులకు పథకము ద్వారా లబ్ధిచేకూర్చబడును అని మంచాల మండల ప్రజా పరిషత్ అధికారి అన్నారం బాల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామి పథకములో భాగంగా పశువుల కొట్టాలు, కోళ్ళ షెడ్, మేకల షెడ్, నాడెప్ ఎరువు తయారి గుంతలు, అజోల పెంపకం, కమ్యూనిటీ సోక్ ఫిట్స్, పండ్లతోటల పెంపకము పనులకు సంబంధించి ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి రవీందర్ రూ.1.04 లక్షల విరాళం



నారపల్లిలో కట్టపోచమ్మ ఆలయానికి విరాళం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రవీందర్

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

పోచారం మున్సిపల్ నారపల్లి విద్యుత్ ఉపకేంద్రం పక్కన చేపడుతున్న కట్టపోచమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం కోసం పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సుర్వి రవీందర్‌గౌడ్ ఒక లక్షా నాలుగు వేయిల రుపాయలు ఇచ్చారు. ఈమేరకు గురువారం ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు పల్లె బిక్షపతిగౌడ్, సభ్యులకు రవీందర్‌గౌడ్ విరాళం డబ్బులను అందజేశారు. అమ్మవారి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మాణం చేసేందుకు కమిటీ దాతల ద్వారా విరాళాలు సేకరిస్తుందని అందరూ సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామపెద్దలు బండ్లగూడెం అశోక్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ సుర్వి సుధా భర్త శ్రీనివాస్‌గౌడ్, సుర్వి శశాంక్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, జంగయ్య, పరుశురాం, యాదయ్య, కృష్ణమూర్తి, ఘన శ్రీనివాస్, వికాస్‌గౌడ్, యాదగిరి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కలకు ఇన్ఫోసిస్, బ్లూక్రాస్ ద్వారా వాక్సినేషన్



వీధికుక్కల వాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ రాజేశ్

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో 400 వీధికుక్కలకు వాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్‌గౌడ్ తెలిపారు. కుక్కలకు వాక్సినేషన్ చేసేందుకు 'ఇన్ఫోసిస్' సంస్థ స్వచ్ఛంధంగా ముందుకు రాగా గురువారం ఎదులాబాద్‌లో 50 వీధికుక్కలకు వాక్సినేషన్ చేయడానికి 'బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్' వారికి అప్పగించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జంతు సంక్షేమ బోర్డు సభ్యురాలు ప్రవళిక, ఇన్ఫోసిస్ బృందం సభ్యులు వంశీ, శశికాంత్, ఆదిత్య, బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ సీఓఓ ఎస్‌కెకే కుమారి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరెడ్డి, వార్డు అధికారి ప్రభాకర్, పర్యావరణ ఇంజనీర్ రాజేశ్‌కుమార్, బ్లూక్రాస్ క్యాచింగ్ టీం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రుల సన్నాహక సమావేశం

**-గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి**
**-ఎసిపి కెపివి రాజు**

**మంచాల ,ఆగస్టు 22, ప్రభాతవార్త**

మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ గ్రామాలకు సంబంధించిన మండప నిర్వాహకులు, కాలనీ వాసులతో గురువారం అవగాహన, సన్నాహక సమావేశం దండేడ్కర్ ఫంక్షన్ హాల్ లో మంచాల సీఐ మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవీ రాజు మాట్లాడుతూ ముందుగా తాము ఏర్పాటు చేసే వినాయక ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జన తేదీ తదితర పూర్తి సమాచారంతో తెలంగాణ పోలీస్‌శాఖ నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటో కాల్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి గొడవలు, ఆటంకాలు లేకుండా జరుపుకోవాలని అన్నారు. నిమజ్జనం సమయంలో భారీ వాహనాలు , కంటైనర్స్ పెట్టరాదని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమతి కొరకు అప్లికేషన్ ఆన్లైన్ లో సబ్మిట్ చేసి స్థానిక పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని, వివాదాలు ఉన్న, ప్రజలకు ఇబ్బంది కలిగించే స్థలాలలో ఎలాంటి విగ్రహాలు పెట్టరాదని, బలవంతపు చందాలు వసూలు చేయరాదని, నిమజ్జనం సమయంలో చెరువుల దగ్గర, లేక్స్ దగ్గర, నదుల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నిమజ్జనం చేయాలని కోరారు. సీఐ మధు మాట్లాడుతూ వృద్ధులు, చదువుకొనే వారికి ఇబ్బందులు కలుగకుండా తక్కువ శబ్ద కాలుష్యం వచ్చేలా స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి పది గంటల వరకే మాత్రమే స్పీకర్లు ఉపయోగించాలన్నారు. మండప నాణ్యతతో ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటలూ మండపంలో ఓ వలంటీర్‌ను నియమించు కోవాలని, ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ముందస్తుగా రెండు బకెట్ల నీరు ఉంచుకోవాలని, మద్యం తాగకూడదని, అసభ్యకర నృత్యాలు చేయొద్దని, అన్యమతస్తులను కించపరిచేలా ప్రసంగాలు చేయొద్దని సూచించారు. మండపాల వద్ద అనుమానిత బ్యాగులు, వస్తువులు, వ్యక్తులు కన్పిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల తహసిల్దార్, ఎంపీడీవో, విద్యుత్ అధికారులు, ఎస్ఐ రామకృష్ణ, ఫైర్ అధికారులు, ఆరోగ్య అధికారులు, ఎస్పై నాగేశ్వరరావు, గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు ఆందోళన

**-వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో కొందరి బెదిరింపులు**
**-మాకు పోలీసులు, ఉన్నతాధికారులు న్యాయం చేయాలంటూ మొర**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

వారసత్వంగా తాతల నుంచి వచ్చిన మా భూమి విషయంలో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, మాకు పోలీసులు, ఉన్నతాధికారులు న్యాయం చేయాలంటూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద నారాయణపూర్ గ్రామ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేసి పోలీసులు, అధికారులు న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతు మల్లెపల్లి హరికృష్ణ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మూడుచింతలపల్లి మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన మల్లెపల్లి నర్సింలుకు (కుమారుడు మల్లేపల్లి హరికృష్ణకు) కుటుంబంకు అనంతారం గ్రామంలో వారసత్వంగా వస్తున్న భూమి ఉందన్నారు. దీనికి సంబంధించి బాధిత రైతుల వివరాల ప్రకారం అనంతారం గ్రామంలో సర్వేనెంబర్లు 94,97లో తమ పేర్లపై పట్టాలు ఉన్నప్పటికీ మల్లేపల్లి నాగరాజు, లక్ష్మయ్యలు తప్పుడు పత్రాలతో మా భూమిని అక్రమంగా కబ్జా చేయటానికి ప్రయత్నిస్తున్నారని బాధిత రైతులు ఆరోపించారు. ఈ విషయంపై కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈ విషయంపై జూలై 2న డిసిపిని కలిసి కోరితే 15రోజుల వరకు ఎవరు పొలంలోకి వెళ్లవద్దని ఆదేశించినా ఆ మరుసటి రోజుననే వారు అనుచరులతో కలిసి భూమిలోకి వచ్చి దాడులకు దిగారని 200పైగా మామిడి, జామ, కొబ్బరి, సీతాఫల చెట్లను నరికి వేశారని, విద్యుత్ మీటర్‌ను కూడ ధ్వంసం చేశారని వారు బాధిత రైతు మల్లేపల్లి హరికృష్ణ,కుటుంబం వారు ఆరోపించారు. జూలై 10న కూడ భూమిలోకి చొరబడి గేటు విరగొట్టి గోడకట్టే ప్రయత్నం చేశారని దీంతో వెంటనే 100కు డయల్ చేయటం జరిగిందని ఫిర్యాదు చేస్తే అయితే తమపైనే పట్టాదారుపైనే ఎఫ్ఐఆర్ నమోదు కావటం తమను కలవరపర్చిందని బాధితు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, ఉన్నతాధికారులు తమకు మా భూమి విషయంలో న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

ఈ భూమికి సంబంధించి పలు వివరాలను వెల్లడించి ఆవేదన వ్యక్తం చేసి సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థల సేకరణపై సమీక్ష

**-పాల్గొన్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థల సేకరణ పురోగతిపై హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ సమీక్షించారు. గురువారం మేడ్చల్ జిల్లా, హైదరాబాద్, మెట్రోపాలిటన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని ఈ కారిడార్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ, జిల్లా పరిధిలో నిర్మాణానికి సంబంధించి స్థితిగతులను హెచ్‌ఎండిఏ కమిషనర్‌కు వివరించారు. అయితే మేడ్చల్ జిల్లాకు సంబంధించి శామీర్‌పేట, తూంకుంట, హకీంపేట్, అల్వాల్, లోతుకుంట ప్రాంతాలలో ఇప్పటికే భూసేకరణకు సంబంధించి సర్వేలు, ప్రజాభిప్రాయ సమావేశాలు, భూములు,స్థలాలు కోల్పోతున్న వారితో చర్చించటం వంటి వాటివి నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ మాట్లాడుతూ ఈ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి ఆర్‌అండ్‌ఆర్ పాలసీ ప్రకారం పరిహారం అందించాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయంగ ఇళ్లు అందించాలని సూచించారు. అల్వాల్‌లోని సత్యా అపార్ట్‌మెంట్ వారికి కల్గిగే నష్టాన్ని అంఛనా వేసి నివేధిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో ఉన్న సాయిబాబ గుడి స్థలానికి మరో చోట స్థలాన్ని కేటాయించి గుడి నిర్మించటానికి గ్రామస్థలను ఒప్పించాలని కమిషనర్ సూచించారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాన్ని గుర్తించి వివరాలు తెలియజేయాలన్నారు. భూసేకరణ కార్యక్రమాన్ని త్వరితగతిన చేపట్టాలని కమిషనర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఎస్‌డిసి డిప్యూటీ కలెక్టర్ మాలతి, అల్వాల్, శామీర్‌పేట మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.




.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్,తహసీల్దార్ల దృశ్యం

# అజీజ్‌నగర్ బిటి రోడ్డు మాయమైందా..?

**-ప్రజా పాలనలో ఇంత నిర్లక్ష్యమా!**
**-గుంతల రోడ్డుపై నాట్లువేసి మహిళలు నిరసన**
**-పేరుకే మున్సిపాలిటి..అభివృద్ధికి నోచుకోని దుస్థితి**
**-కాంట్రాక్టులకు బిల్లులు లేక ఆగిన రోడ్డు అభివృద్ధి**

**మొయినాబాద్, అగస్టు 21, ప్రభాతవార్త :**

మొయినాబాద్ మున్సిపాలిటిలోని అజీజ్‌నగర్ బీటిరోడ్డు మాయమైందా అన్నట్లుగా పూర్తిగా గోతులు ఏర్పడి మురుగునీరు చేరి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు, అజీజ్‌నగర్‌లోకి వెళ్తున్నటువంటి దారి శ్రీనిధిస్కూల్ నుండి ఎస్సీకాలనీ దాటి అజీజ్‌నగర్‌లోని హనుమాన్ టెంపుల్ వరకు పూర్తిగా బీటి రోడ్డు కనిపించకుండా దాదాపు 2 కిలోమీటర్ల మేరకు పూర్తిగా పాడైపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అందులో వర్షపు నీరు చేరి అసలు గతంలో ఇక్కడ బీటి రోడ్డు ఉందా లేదా నూతన రోడ్డు వేయాలా అన్నట్లుగా చెడిపోయింది, ప్రయాణికులు ప్రయాణిస్తే ప్రమాదం పోంచి ఉందని, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఏ అధికారి పట్టించుకోవడంలేదని, ఆరోపిస్తున్నారు, మొయినాబాద్ మున్సిపాలిటిలో అత్యంత బిజిగా ఉన్నటువంటి అజీజ్‌నగర్, నివసిస్తున్న ప్రజల సంఖ్య కూడ ఎక్కువగానే ఉంటుంది, నిత్యం ఆపీసులకు, పాఠశాలలకు వెళ్లేటువంటి బస్సులకు,విద్యార్థులకు, వృద్ధులకు, ఆంబులెన్స్ రాలేని పరిస్దితితో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని కనీసం వహనాలు కాకుండా నడిచే పరిస్దితి కూడ లేకపోయిందన్నారు, అందుకే నిరసనగా నాట్లువేసినట్లు తెలిపారు, ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు చర్యలు చేప్పట్టి రోడ్డును మంజురుచేయాలని కోరుతున్నారు, ఈ కార్యాక్రమంలో అజీజ్‌నగర్ మాజి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ నాయకులు, మహిళలు పెద్దలు పాల్గోన్నారు.



**పంచాయితీరాజ్ డిఈ విజయ్‌కుమార్ వివరణ**

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో శ్రీనిధి పాఠశాలవరకు బీటిరోడ్డు, అక్కడి నుండి ఎస్సీకాలని దాటేంతవరకు సీసీరోడ్డు వేయాలని గత ప్రభుత్వంలో 3 కోట్ల రూపాయలు సాంక్షన్ అయ్యాయని, కాని టెండర్‌లకు కాల్ చేసినప్పుడు, గత ప్రభుత్వంతో సీసీ రోడ్డు వేయడానికి ఏ ఒక్కరు రాకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత,, నిర్లక్ష్యంగా మిగిలిపోయిన టెండర్‌లను వెనక్కి తీసుకోవడం జరిగిందని తిరిగి ప్రభుత్వానికి మరలా సీసీ రోడ్డు కోసం సాంక్షన్ చేయాలని లెటర్ పెట్టడం జరిగిందన్నారు, కాని ఇప్పటివరకు ప్రభుత్వం నుండి గతంలో బీటి రోడ్డువేసిన కాంట్రాక్టరు, సీసీరోడ్డు వేయడానికి సిద్దంగా ఉన్నా ఆయనకు గత రోడ్డు బిల్లులు ఇప్పటి వరకు రాలేదు, కాంట్రక్టర్ బిల్లులు వస్తే, కాంట్రాక్టర్ సీసీ రోడ్డు తీసుకోని వేయడానికి సిద్దంగా ఉన్నాడని, ప్రభుత్వం నుండి జవాబురాలేదని, వస్తే పూర్తిచేస్తామన్నారు,

## డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను సందర్శించిన జిల్లా సిపిఎం కార్యదర్శి సత్యం



.తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను జిల్లా సిపిఎం కార్యదర్శి సత్యం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్న దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం, సిపిఎం నాయకుల బృందం సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఆయనతో పాటు సిపిఎం నాయకుల బృందం సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రదానంగా తూంకుంట మెయిన్‌రోడ్డు నుంచి డబుల్‌బెడ్‌రూమ్స్ దూరంగ ఉండటంతో పాటు ప్రజలకు బస్టాప్ కూడ లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆర్టీసి బస్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు మహిళల భద్రతత కోసం సాయంత్రం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను కోరారు. పక్కనే చెరువు కుంట ఉన్నందున వర్షాలతో నిండటంతో కుంట కట్ట లీకేజీలతో ఇండ్లలోకి నీరు వస్తుందని అన్నారు. కుంటకట్టను మరమ్మత్తు పనులు చేయించాలన్నారు. అంగన్‌వాడి సెంటర్‌ను, రేషన్‌షాపును, ప్రైమరీస్కూల్‌ను,హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.దీనిలో జిల్లా నాయకులు ఎర్ర అశోక్, ఎం.నరేశ్, ఎం.కిష్టప్ప,పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:**

వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలతో ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చూడాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్‌హాలులో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి బుచ్చిరెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ ఆనంద్‌లు హాజరై నిర్వాహకులకు గణేశ్ ఉత్సవాల నిర్వహణ, ప్రమాదాల నివారణ, భక్తి, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం తదితర విషయాలపై తెలియజేశారు. ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి మాట్లాడుతూ వినాయక విగ్రహాల ప్రతిష్ట, నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనంలో పాటించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ గుండ్ల రామతీర్థ, ఘట్‌కేసర్ కన్వీనర్ అంకం చంద్రకాంత్ యాదవ్, అసెంబ్లీ సభ్యులు భాను, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వశాంతియాగము..అన్నప్రసాదం



హోమం నిర్వహిస్తున్న ధర్మకర్తలు గౌరీశంకర్

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో గురువారం 10వ విశ్వశాంతి యాగము ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా అర్చకులు శ్యామ్‌కుమార్, మహేశ్‌కుమార్‌ల మంత్రోచ్ఛారణాల మధ్య విశ్వశాంతి యాగము నిర్వహించారు. లోకకళ్యార్థం ప్రతి నెలా మాస శివరాత్రి రోజు విశ్వశాంతి యాగము నిర్వహిస్తున్నామని దాతలు సహకరించి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ధర్మకర్తలు కంట్లం గౌరీశంకర్ కోరారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆలయంలో మల్లిఖార్జునస్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఆవరణలో 21 అడుగుల ఎత్తైన శ్రీవీరహనుమాన్ నల్లరాతి విగ్రహానికి త్వరలో భూమి పూజ చేయనున్నామని దాతలు సహకరించి విరాళాలు అందజేయాలని ధర్మకర్త గౌరీశంకర్ కోరారు. హనుమాన్ విగ్రహానికి ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి మొదటగా లక్ష రుపాయల విరాళం అందజేయాలని ఆయన తెలిపారు.

## ప్రైమ్‌లాండ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ప్రైమ్‌లాండ్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ప్రైమ్‌లాండ్ వెంచర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక అయ్యింది. వెంచర్‌లోని శ్రీగణపతి ఆలయ ఆవరణలో గురువారం జరిగిన ప్లాట్ల యాజమానుల ప్రత్యేక సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొమ్మిడి జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాల్వేరు రాజేశ్, ఉపాధ్యక్షులుగా ఇమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మన్నె నందుమూర్తి, సోమసాని రమేశ్, దంతాల అనిల్‌కుమార్, కోశాధికారిగా మామిండ్ల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా బర్ల రాధాకృష్ణ, కాగు హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తెలుకుంట్ల శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా జి.విజయ్‌కుమార్, ఎం.రవీందర్, సలహాదారులుగా అబ్బసాని యాదగిరియాదవ్, కేశవపట్నం అంజనేయులు, బర్ల దేవేందర్, పి.శశిధరణ్, ఎం.ధన్‌రాజ్ (న్యాయవాది)లను ఎన్నుకున్నామని తెలిపారు.

## ఘట్‌కేసర్‌లో అంబులెన్స్‌ను డిఎంహెచ్‌ఓ తనిఖీ



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఓ కౌశిక్

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో గురువారం 108 అంబులెన్స్‌ను మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కౌశిక్ అకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర వైద్య పరికరాలను ఆయన పరిశీలించి సిబ్బందిని ప్రశ్నించారు. ఏఈడి, ఆక్సిజన్, సక్షన్ అడాప్టర్ ఇతర వైద్య పరికరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు, రోగులకు సరైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. అంబులెన్సు సిబ్బంది ఫైలెట్ బద్రునాయక్, ఈఎంటి రమేశ్ సిబ్బంది ఉన్నారు.

## సేవలు ప్రశంసనీయం : మాజీ మంత్రి మల్లారెడ్డి



డబిల్‌పూర్‌లో పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి,పాల్గొన్న తదితరుల దృశ్యం

**మేడ్చల్, ఆగస్టు 21, ప్రభాతవార్త**

పేద విద్యార్థుల కోసం ఉశాట్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో వన్ స్కూల్ ఎట్ఎ టైమ్ (ఉషాట్) సంస్థ నిర్మించిన ఐదు ఆదునాతన తరగతి గదుల భవనాన్ని ఆయన విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఉషాట్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని, సుమారు 90లక్షల రూపాయలతో ఈ భవనంను నిర్మించి ప్రారంభించటం గొప్ప విషయమన్నారు. ఈ అద్భుత భవనాన్ని నిర్మించిన ఉశాట్ సంస్థ వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. దీనికి మాజీ సర్పంచు రాజమల్లారెడ్డి, మాజీ ఎంపిపి రజితమల్లారెడ్డిల కృషి అభినందనీయమన్నారు. దీనిలో సంస్థ ప్రతినిధులు నరసింహరావు, హెచ్‌ఎం వేణుమాదవ్, మాజీ సర్పంచులు రాజమల్లారెడ్డి, గీత భాగ్యారెడ్డి, పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా వెంకటగోపాల్

**మేడ్చల్, ఆగస్టు 21, ప్రభాతవార్త**

గుండ్లపోచంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఆర్.వెంకటగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆయన విచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. డిఇఇ దుర్గాప్రసాద్, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. దీనిలో మేనేజర్ సిహెచ్ శ్రీనివాస్‌గౌడ్, జెఎఒ ప్రణతి, సిబ్బంది చంద్రమోహన్, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## దోమ మాజీ జడ్పిటిసి నాగిరెడ్డి విచారణ

**పూడూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త :**

దోమ మండల మాజీ జడ్పీటీసి నాగిరెడ్డిని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేస్తున్నట్లు సమాచారం.గతంలో దోమ మండలంలోని దిర్సంపల్లి గ్రామ శివారులో సరియైన అనుమతులు లేకుండా మైనింగ్ చేపట్టినట్లు ఆరోపణలు రావడంతో ఫారెస్టు,మైనింగ్ అధికారులు కేసునమోదు చేశారు.దీంతో గత వారంక్రింద లొంగిపోయిన నాగిరెండిని విచారించేందుకు పోలీసులు కస్టడీకి కోరగా కోర్టు అనుమతి ఇచ్చింది.దీంతో ఐదు రోజుల కస్టడీలో భాగంగా గురువారం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు.నాగిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పరామర్శించగా,మిగతావారికి పోలీసులు అనుమతి ఇవ్వలేదని సమాచారం.ఈ కేసు విషయమై చెన్‌గోములు ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డిని వివరణకోరగా పరిగి సిఐ అద్వర్యంలో విచారణ జరుగుతుందని,తనకు సంబంధంలేదని ఆయన తెలిపారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపిపి పటేల్ విజయ్‌కుమార్

**దౌల్తాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నరని దౌల్తాబాద్ మండల మాజీ ఎంపిపి పటేల్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారంరోజు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని చల్లాపూర్ గ్రామానికి చెందిన బి.పకిరప్ప, నజియాబేగం లకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు వారికి అయ్యే ఖర్చును సీఎం సహాయ నిధి ద్వారా అందిచడం పేదల పాలిట వరం లాంటిది అని అన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు.

## పనుల జాతరను విజయవంతం చేయండి

**జిల్లేడు చౌదరిగూడెం, అగస్టు, 21, (ప్రభాతవార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార నిర్వహిస్తున్న పనుల జాతర 2025కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వార పనుల ప్రారంబోత్సవాలు, శంఖుస్థాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాల్గొన్ని కార్యమ్రాన్ని విజయవంతం చేయాలని ఆయన పెర్కోన్నారు.

## వెళ్లకపోతే తిరుగుబాటే

**జిల్లేడు చౌదరిగూడెం, అగస్టు, 21, (ప్రభాతవార్త):** మార్వాడిలు తమ మండలాన్ని వదిలి వెళ్లకపోతే తురుబాటు చేసి వెళ్లగొడతామని బీసిసేన మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య అన్నారు. బతుకుదెరువు కోసం అని వచ్చి ప్రజలను దొచుకునే స్థితికి వచ్చారని అన్నారు. మార్వాడి గో బ్యాక్ నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించి మార్వాలు వెళ్లిపోయేంతవరకు పోరాటం చేయాలని అన్నారు. మార్వాడిలు తమ మండలాన్ని వదిలి వెళ్లకపోతే బిసిసేనా ఆద్వర్యంలో ఉద్యదం చేపడతామని ఆయన హెచ్చరించారు.

## బందును విజయవంతం చేయండి

**కొందుర్గు, అగస్టు, 21, (ప్రభాతవార్త):** రాజస్థాన్, గుజరాజ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల దోపిడి దౌర్జాన్యాలను అరికట్టాలనే ఉద్యేశ్యంతో ఉస్మానియ జెఏసి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నాడు బందులో స్వచ్చందగాపాల్గొని విజయవంతం చేయాలని స్థానిక వ్యాపార సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వ్యాపారులు పలు దుఖానాలకు వెళ్లి బందును వాజయవంతం చేయాలని కోరారు.

## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్సై శైలజ

**కోట్‌పల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త;** గణేష్ మండపాలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎస్సై శైలజ అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి అమె మాట్లాడారు. మండలంలో గ్రామాలలో ఉత్సవాల సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా మండపాల ఏర్పాటుకు పోలీసుల నుండి అనుమతి తీసుకోవడం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రధాన రహదారిలో గణేష్ మండపాలు నిర్వహిస్తే కనీసం టూ వీలర్ వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్లు కోసం విద్యుత్తు అధికారుల పర్మిషన్ కుడా తప్పని సరిగా తీసుకోవాలన్నారు. రద్దీగా ఉన్న మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైనా ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల్లో అనుమానాస్పదంగాబ్యాగులు ప్లాస్టిక్ సంచులు ఉంటే తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గాని 112, గాని సమాచారం అందించాలన్నారు. గణేష్ మండపాల వద్ద ప్రత్యేకంగా డీజేలకు కుడా అనుమతి లేదన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సందర్బంగా వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు కోసం పోలీస్ శాఖ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అమె పేర్కొన్నారు,

## మహాధర్నాను విజయవంతం చేయాలి

### - యూఎస్‌పిసి ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న యూఎస్‌పీసీ నేతలు

**షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఈనెల 23న రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఎంఈఓ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యారంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని క్యాడర్ల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని, ఖాళీలు భర్తీ చేయాలని వారు కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్ట్‌మెర్, ఏకీకృత సర్వీస్ నిబంధనలు తదితర అంశాలకు సంబంధించిన ఈ మహాధర్నాను చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే ఈ మహాధర్నాకు ఉపాధ్యాయ సంఘాలకు అతీతంగా తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డివిజన్ నాయకులు కె.వెంకటయ్య, ఎన్.నర్సింహ్మాగౌడ్, అర్జునప్ప, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, మధు, మోహన్, భరత్‌కుమార్, హరికృష్ణ, అర్జునయ్య, చంద్రశేఖర్, సురేందర్, శివరాములు, నర్సింలు, కృష్ణ, నర్సింలు, లక్ష్మీదేవమ్మ, మంజుల, సమత, వైష్ణవి, రామకృష్ణ, వినీత్, శివ, బాలయ్య, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

### -ఎన్నికల అధికారిగా రాఘవరెడ్డి

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రెడ్డి సంఘం సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. సంఘం కార్యవర్గం పదవీకాలం ముగియడంతో కొత్త కార్యవర్గాన్ని ఎనడుక్కోవడానికి అనుబంధం ప్రకారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది కొమ్మిడి రాఘవరెడ్డిని నియమించారు. ఈనెల 24 నుంచి 25 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, ఈనెల 31న (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3 తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెలువడించడం జరుగుతుందని తెలిపారు. అధ్యక్ష పదవికి రూ.10 వేలు, ఉపాధ్యక్ష పదవీకి రూ.5 వేలు, ప్రధాన కార్యదర్శి పదవికి రూ.7,500లు, సంయుక్త కార్యదర్శి పదవీకి రూ.4,500లు, కోశాధికారి పదవీకి రూ.4,500లు, కార్యవర్గసభ్యులకు రూ.2,500ల చొప్పన రుసుము చెల్లించాల్సీ ఉంటుందని, ఆసక్తి కల్గిన సభ్యులు సంఘం నియమ, నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీచేయాలని కార్యదర్శి పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## నందివనపర్తిలో వైభవంగా పోచమ్మ బోనాలు

**యాచారం, ఆగస్టు21, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు ఊరేగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించిన మహిళలు తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాల గుబాళింపు బోనాలు ప్రత్యేక ఆకర్షణలో నిలిచిన ఆడపడుచులు తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక. ప్రకృతితో మమేకమై జీవించే వ్యవసాయ ఆధారిత సమాజ సాంప్రదాయ సామూహిక తాత్వికత, బోనాల పండుగ సందర్భంగా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో గురువారం పోచమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. బోనాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.ఎన్.రెడ్డి ట్రస్టు చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ రాజు నాయక్, కంబాలపల్లి ఉదయశ్రీ, మూడేడ్ల వెంకట్ రెడ్డి, హాజరైనారు. ఈ తెల్లవారుజామున అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించి.. తొలి బోనం సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య విన్యాసాలు, నృత్యాలతో తిరుగుతూ ఊరేగించారు. విన్యాసాల మధ్య యువకుల కేరింతలతో బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా ముస్తాబైన మహిళలు నెత్తిన బోనాల



నందవనపర్తి పోచమ్మ బోనాల కార్యక్రమంలో పాల్గొన్న రాచర్ల వెంకటేశ్వర్లు, జోగిరెడ్డి ,మాజీ సర్పంచ్ ఉదయశ్రీ, మూడేడ్ల వెంకట్ రెడ్డి

తో బాజభజంత్రీల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవార్లకు బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం వేలాదిగా భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిపించి పంటలు బాగా పండించేలా చూడాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు మహిళలు తెలిపారు. అంటువ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడు తల్లీ అంటూ పోచమ్మను భక్తి శ్రద్ధలతో కొలిచారు. ఈ కార్యక్రమంలో మాల కులస్తులు ,గ్రామస్థులు పాల్గొన్నారు.

## చెరువులు నిండాలి..పంటలు బాగా పండాలి

### -గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**షాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** చెరువుల నిండి, పంటలు బాగా పండి, రైతులు అభివృద్ధి చెందాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని పైల్వాన్ చెరువు నిండి అలుగు పారడంతో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చెరువు గట్టున ఉన్న ఆంజనేయ స్వామికి, చెరువు అలుగు వద్ద పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ పైల్వాన్ చెరువు నిండితే షాబాద్ మండలం తో పాటు శంషాబాద్ మండలం, నందిగామ మండలం తిమ్మాపూర్ వరకు భూగర్భ జలాలు పెరిగి రైతులకు సమృద్ధి నీరు అందుతుందన్నారు. దీంతో పాడి పంటలు పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. రైతులు సంతోషంగా ఉన్నప్పుడే దేశం బాగుపడుతుందని అన్నారు. అంతేకాకుండా చేపలతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు చెరువులోకి షాబాద్ నుండి వస్తున్న మురుగునీరు కలిసి కలుషితం అవుతున్నాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే ఆయన స్పందించి మురుగునీరు చెరువులో కలవకుండా జెసిబి తో మరో వైపు



షాబాద్ పైల్వాన్ చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న మధుసూదన్ రెడ్డి, తదితరులు

కు వెళ్లేలా కాలువ పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, మహేందర్ గౌడ్, నర్సింలు, శ్రీనివాస్ గౌడ్, లింగం, నాయకులు దండు రాహుల్, ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, సుభాష్ రెడ్డి, గౌరీశ్వర్, గౌతమ్, కిషోర్, రఫిక్, రమేష్, శేఖర్, పార్టీ కార్యకర్తలు,పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**కీసర, ఆగస్టు21, ప్రభాతవార్తః** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కీసర ఆర్‌డిఓ వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ కన్వేషన్ హాల్‌లో నాగారం, దమ్మాయిగూడ పురపాలక సంఘాల పరిధిలోని గణేష్ మండపాల ఏర్పాట్లు, నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ గణేష్ మండపాలకు మున్సిపల్, పోలీస్ శాఖల ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యుత్ భద్రత అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు, జనరేటర్లు, సౌండ్ సిస్టమ్‌లపై ఖచ్చితమైన నిబంధనలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా మండపాలను ఏర్పాట్లు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిమజ్జనం కోసం ట్రాఫిక్ శాఖ ప్రత్యేక రూట్ మ్యాప్, డ్రోన్ కెమెరాల నిఘా, పోలీస్ పికెట్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా నిమజ్జన కుంటల పరిశుభ్రత, నీటి మట్టం, భద్రతా పర్యవేక్షణ చేస్తారన్నారు. పెద్ద విగ్రహల నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్లు, బార్జిలు సిద్ధం చేస్తామన్నారు. ఇది ప్రభుత్వ భాద్యత కాదు, మండపాల నిర్వాహకులు, కాలనీ సంఘాలు కూడా సమానంగా సహకరించాలన్నారు.



నాగారంలో వినాయక చవితి సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ వెంకట ఉపేందర్‌రెడ్డి

వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరగాలంటే ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కమీషనర్ భాస్కర్‌రెడ్డి, కుషాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ అశోక్ కుమార్, సిఐలు ఆంజనేయులు, సైదులు, హెచ్‌ఆర్‌డిసిఎల్ డిఈ సత్య నారాయణ, ట్రాఫిక్ సిఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

### బిసి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

**షాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. షాబాద్ మండల పరిధిలోని కక్కులూరు గ్రామంలో గురువారం బీసీ సేన గ్రామ కమిటీని బీసీ సేన మండల అధ్యక్షుడు దయాకర్ చారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బర్క కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. గత 45 సంవత్సరాలుగా బీసీల హక్కుల కోసం, సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలు అభివృద్ధి సాధించేందుకు ఆర్ కృష్ణయ్య అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాల వల్ల నేడు బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు చలనం వచ్చిందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నుంచి బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కక్కులూరు గ్రామ బీసీ సేన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ నూతన కమిటీ అధ్యక్షులుగారాజేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యద



కట్లూరు గ్రామంలో నూతనంగా ఎన్నుకున్న కమిటీతో బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, తదితరులు.

ర్శిగా కావలి శ్రీశైలం, యువజన కమిటీ అధ్యక్షులుగా చాకలి తిరుపతి, ఉపాధ్యక్షులుగా జింకల శివశంకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంగలి నరసింహులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన మండల ఉపాధ్యక్షులు మీరంపల్లి బాలరాజ్, యువజన అధ్యక్షులు అజయ్ కుమార్, కార్యదర్శి శివకుమార్, నాయకులు దోస్వాడ శ్రీశైలం, అబ్బాస్, ఆనంద్, మహేందర్, వెంకటేష్ ప్రసాద్, రమేష్, మాజీ సర్పంచ్ యాదగిరి, కృష్ణ, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## కనుల పండువగా కాకునూర్‌లో అమ్మవార్ల బోనాలు



**కేశంపేట ఆగస్టు 21 ప్రభాతవార్త** ఆషాడ మాసం ఆఖరిలో అమ్మవార్లకు బోనాలను సమర్పించడం మన హిందూ సాంప్రదాయం. మన సాంప్రదాయంలో భాగంగా గురువారం కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో ఈదమ్మ, కోట మైసమ్మ, పోచమ్మ బోనాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎక్కడ చూసిన పిల్లాపాపలతో ఆడపడుచులతో కన్నుల పండుగగా కనిపించింది. సాయంత్రం సంధ్య వేళలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునేందుకు ఆడపడుచులు బోనాలను అలంకరించి నెత్తిపై ఎత్తుకొని అమ్మవార్ల నామస్మరన స్మరించుకుంటూ సన్నాయి మేళలతో డప్పు వైద్యాలతో డిజె సప్పుడ్లతో తొట్టెలను అలంకరించుకొని నృత్యాలు చేసుకుంటూ అమ్మవార్ల ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి, కొబ్బరికాయలను కొట్టి బండారు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు చిన్నారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలి : ఎస్ఐ

**పూడూరు, ఆగష్టు 21 ప్రభాతవార్త :** వినాయక చవిత సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్టించే వినాయక మండపాలకు అనుమతులు తప్పకుండ తీసుకోవాలని ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజెలకు అనుమతులు లేవని, మండపాలలో విద్యుత్తు సౌకర్యం కోసం సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో 10గంటలలోపు మైకులను బందు చేయాలని వివరించారు. మండపాలలో రాత్రిపూట నిర్వాహకులు ఉండాలని తెలిపారు. మండపాల నిర్వాహకుల అధ్యక్ష, కార్యదర్శులపేర్లు, వారి ఫోన్‌నెంబర్లను పొందుపరుచాలన్నారు.

### సంగెం గ్రామంలో గంజాయి స్వాధీనం



గంజాయి వినియోగిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న కేశంపేట పోలీసులు

**కేశంపేట ఆగస్టు 21 ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో గురువారం ఒడిశా రాష్ట్రానికి చెందిన బిస్వంత్ మెహెర్ అనే వ్యక్తి కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుండే అతని వద్ద 46 గ్రాముల నిషేధిత మత్తు పదార్థం గంజా స్వాధీన పరచుకుని అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు కేశంపేట సిఐ నరహరి తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలు వాడడం, నిల్వ చేయడం, రవణ చేయడం, చట్ట విరుద్ధం. ఇటువంటి అక్రమ కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరహరి తెలిపారు.

## విజయవంతంగా భారత కమ్యూనిస్టు పార్టీ, రాష్ట్ర మహాసభలు




**మొయినాబాద్, అగస్టు 21, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాల్గోవ మహసభలు మేడ్చల్ జిల్లాఓని గాజుల రామారంలో ఘణంగా జరుగుతున్నాయని మొయినాబాద్ మండల సిపిం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామాస్వామి అన్నారు, రాష్ట్ర నాల్గోవ మహసభల్లో భవిష్యత్తు కార్యాచరణ పైన నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ అభివృద్ధి కోసం ప్రజా సంఘాల నిర్మాణం కోసం ప్రజా సమస్యల పైన పోరాటం కోసం ఇలున్ల లేని నిరుపేదలకు ఇండ్ల స్దలాల కోసం భూపోరాటం పై కార్యాచరణ ఉంటుందని ఈ మహసభలలో తెలంగాన రాష్ట వ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు పాల్గోంటున్నారని ఒక ప్రకటనలో తెలిపారు, ఈ కార్యాక్రమంలో సిపిఐ జిల్లా కార్యావర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, ఎన్ఎఫ్ఐడబ్లూ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యాదర్శి కె. శ్రీనివాస్ చేవేళ్ల మండల కార్యాదర్శి ఎం. సత్తిరెడ్డి, షాబాద్ మండల పార్టీ కార్యాదర్శి పాలమాకుల శ్రీశైలం, తధితరులు పాల్గోన్నారు,

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - డాక్టర్.రాజ్ కుమార్



నర్సప్పగూడలో వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న జెంట్స్ వైద్యులు.

**నందిగామ ఆగస్టు 21 ప్రభాతవార్త** ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తం కావాలని జిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వీ రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నందిగామ మండలం నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో ముచింతల్ జిమ్స్ మెడికల్ కాలేజ్, ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు ద్వార ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం వ్యాధులు ఈగలు దోమల ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లు , శ్వాస కోశ ఆరోగ్యం , పోషకాహార రుగ్మతలపై వివరించారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ విష్ణుబాంధవి, డాక్టర్ సుష్మ, ఇంటర్న్ పూజ, ఇంటర్న్ శివాని మరియు ఎమ్మెస్ డబ్ల్యూ సన్యాసి నాయుడు, సోషల్ వర్కర్ దినేష్ కుమార్ చౌబే తదితరులున్నారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

### -చినుకు పడితే రోడ్డు చిత్తడి చిత్తడి

### -పట్టించుకునే వారే లేరంటున్న గ్రామస్తులు



నందిగామ నుండి బైపాస్ వెళ్లే అంతర్గతరహదారి దుస్థితి

**నందిగామ ఆగస్టు 21 ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రం నుండి రంగాపూర్, మేకగూడ వెళ్లే అంతర్గత రహదారి చినుకు పడితే చిత్తడి చిత్తడి గా మారి వాహనదారులకు ఇబ్బందిగా పరిణమించింది. రోడంతా నీళ్లతో అడుగుకో మడుగు తలపిస్తూ ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఇలా ఉంటే.. ప్రయాణం ఎలా చేయాలని గ్రామస్తులు, కార్మికులు, విద్యార్థులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని అధికారులను కోరుతున్నారు.



రంగాపూర్ వెళ్లే రహదారి గోతులమయమైన దృశ్యం

## విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

**తాండూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని బిసి కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం తాండూరు లోని తన కార్యాలయం లో విత్తన గణపతి విగ్రహాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రీక విజయలక్ష్మి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, ట్రస్ట్ చైర్‌పర్సన్ శివానితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరితసేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన గణపతిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడు కుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిద ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు, వివిద సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌పి ట్రస్ట్ ఆద్వర్యంలో విగ్రహాల పంపిణీ

## వికారాబాద్ జిల్లా సమస్యలను పరిష్కరించాలి

### -సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్




సీపీఐ మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 21, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా సమస్యలను పరిష్కరించే దిశగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి లు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ప్రతిపాదించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యాపరంగా, జిల్లా వెనుకబడి ఉందని, జిల్లా ఆస్పత్రి ఉన్నప్పటికీ సౌకర్యాలు కొరతతో ప్రజలు అనునిత్యం వైద్యం కోసం హైదరాబాద్, గుల్బర్గా వెళ్లవలసి వస్తుందని అన్నారు. చాలా జిల్లాల్లో ఇటువంటి పరిస్థితులే ఉండవచ్చని, కావున అన్ని వసతులతో జిల్లా ఆస్పత్రుల ౦ అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి , స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కావున సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం పై వత్తిడి తేవాలని, మన ప్రాంతంలో ఉన్న సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రైవేటు పరం కాకుండా చూడాలని, సిమెంటు, సుద్ధ ఫ్యాక్టరీల్లో, నాపరాతి గనుల్లో, పాలుషింగ్ యూనిట్లలో, కొన్నివేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నప్పటికీ నేటికీ ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రి లేదని. మంజూరు అయిందని చెప్పున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని వెంటనే ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.